విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 30, అక్టోబరు 2025

నంద్యాలలో భారీ వర్షం

బస్సు జాతాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బనగానపల్లె: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే బస్సు జాతాను జయప్రదం చేయాలని జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎర్రి స్వామి పిలుపునిచ్చారు. బుధవారం నాడు స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు గోడపత్రికను ఆవిష్కరించారు. ఎర్రి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. పేద విద్యార్థులకు పీజీవిద్య దూరం చేసే 77 జీవోను రద్దు చేయాలని, విద్యారంగా సమస్యల పరిష్కారానికి ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు జరిగే బస్సు జాతను జయప్రదం చేయాలని, వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో బస్సు జాత నంద్యాల జిల్లాలకు ప్రవేశిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మాథష్, చందు, ఏఐఎస్ఎఫ్ చింటూ, అమర్నాథ్, రమేష్, శేష మనోజ్, సుభాన్, బ్రహ్మం, సుధర్షన్, శ్రవణ్, సుధేర్ పాల్గొన్నారు.

విశ్వనగర్ వంతెనపై నడిచి..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణంలో తుఫాన్ నేపథ్యంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు నాయకులు, అధికారులు దూరం నుంచి ప్రజలకు జాగ్రత్తలు ఇస్తు న్నారు. మంగళవారం నుంచి విశ్వనగర్ బ్రిడ్జిని వరదనీరు తాకుతు న్నాయి. బుధవారం సాయంత్రానికి విశ్వనగర్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు పడుతున్నాయి. అటువైపు ఉన్న ప్రజలు ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి తలెత్తింది. విషయం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తెలుసుకున్నారు. వెంటనే కార్యకర్తలు, అభిమానులతో కలిసి విశ్వనగర్ వద్దకు చేరుకున్నారు. బ్రిడ్జిపై వరదనీరు ఉధృతి గమనించారు. వెంటనే బ్రిడ్జి వద్దకు కదలడంతో కార్యకర్తలు, అభిమానులు వద్దని చెప్పినా వినకుండా అడుగు ముందుకు వేయడంతో ఆయన అడుగులో అడుగు వేసుకుంటూ విశ్వనగర్ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు ధైర్యం నింపి, ఏ అవసరం వచ్చినా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

మండలంలో 650 హెక్టార్లలో పంట నష్టం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: మండలంలో తుఫాను ప్రభావంతో 650 హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్టు జిల్లా వ్యవసాయ అధికారులు అంచనా వేసారు. బుధవారం కోవెలకుంట్ల మండలంలోని రెవనూరు గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారుల బృందం పర్యటించింది. గ్రామంలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో వ్యవసాయ అధికారులు మాట్లాడారు. పంటను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ సుధాకర్, ఏవో సుధాకర్ రెడ్డి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మర సహాయక చర్యల్లో తహసీల్దార్

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు కాలనీలలో నీరు నిలిచి నివాసాల్లోకి వెళ్ళుచుండగా తహసీల్దార్ తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు. ఈవో అశ్విని కుమార్, గ్రామ విఆర్ఓల ఆధ్వర్యంలో మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో వర్షపు నీరు అధికమై కాలనీలలో స్తంభించి ఉండగా వెంటనే జెసిబి యంత్రం సహాయంతో సమస్య పరిష్కారానికి తహసిల్దార్ కృషి చేశారు. యర్రగుంట్ల ఎస్సీ, బీసీ కాలనీలో గత రెండు రోజులు నుండి మొంథా తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయంగా ఒరిగిన చెట్లను ఈవో అశ్విని కుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. మండల పరిధిలోని శిరివెళ్ల మహాదేవపురం ఖాదరబాదర చెన్నూరు ఇసుకపల్లి యర్రగుంట్ల తదితర గ్రామాల పరిధిలోని వీఆర్వోలను వీఆర్ఏలను అప్రమత్తం చేసి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు వంకల వద్ద నిఘా ఏర్పాటు చేశారు. కొత్త వ్యక్తులు, ఆయా గ్రామాల ప్రజలు, వాగులు వంకలు దాటకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ టిడిపి నాయకులు వీఆర్వోలు వీఆర్ఏలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ఇళ్లలోని వారు, పాత మట్టిమిద్దెలోని వారు, వరద ప్రభావం ఉండే ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి జగ్గయ్య, తహసీల్దారు విజయ్ కుమార్, ఎంపీడీఓ తాహీర్‌హుసేన్‌లు తెలిపారు. మండలంలోని నేలంపాడు గ్రామంలో బుధవారం అధికారులు పర్యటించారు. ముంపునకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీల్లో నిలచిన వరద నీటిని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పాత మట్టిమిద్దెలను పరిశీలించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలం గుండా సాగుతున్న వాగులు పొంగడంతో వక్కిలేరు, భవనాశి వాగులను పరిశీలించారు. వాగుల్లో ప్రవాహం తగ్గే వరకు వాగుల వద్దకు ఎవ్వరూ వెళ్లకూడని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కొండారెడ్డి పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎస్పీ పర్యటన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలలో జిల్లా ఎస్పి సునీల్ షెరాన్ పర్యటించారు. ఆత్మకూరు పట్టణంలోని భవనాశి వాగును పరిశీలించి వాగు దగ్గర వరద ప్రవాహం ఎక్కువగా ఉందని, ఎవరు వాగు దాటుద్దని, గ్రామాలలో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని అక్కడ వారికి అన్ని విధాలుగా తమ ప్రభుత్వం తరఫున సహాయక చర్యలు చేస్తుందని, ఎవరికైనా ఏదైనా అత్యవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. డీఎస్పీ రామాంజి నాయక్, సీఐ రాము, ఎస్సై వెంకట నారాయణ రెడ్డి, ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ రత్న రాధిక పాల్గొన్నారు.

అంబేద్కర్ గురుకుల పాఠశాలకు వరద ముప్పు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామ సమీపంలో ఉన్న బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలకు వరద ముప్పు పొంచి ఉండడంతో బుధవారం సాయంత్రం సుమారు 500 మంది విద్యార్థినులను మరో పాఠశాలకు తరలించారు. పడకండ్ల గ్రామ సమీపంలో వకులానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పాటు వెలుగోడు జలాశయం నుండి అధికారులు నీటిని విడుదల చేస్తుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు పాఠశాలను పరిశీలించి విద్యార్థినులు ముందు జాగ్రత్త చర్యగా షాదిఖానా సమీపంలో ఉన్న ఆర్పి ఆర్పి గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలకు తరలించినట్లు మండల ప్రత్యేక అధికారి హరి కిషోర్, ఎంపీడీవో నూర్జహాన్, మండల తాహాసిల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంఈఓ శోభా వివేకవతి తెలిపారు.

జలమయమైన పలు కాలనీలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్రవాపితంగా భారీ వర్షాలకు కారణమైన 'మొంథా' తుఫాను జిల్లా మీద తన పంజా విసురుతోంది. భారీ వర్షం కారణంగా జిల్లాలో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు చోట్ల రాకపోకలకు సైతం అంతరాయం ఏర్పడు తోంది. ప్రధానంగా మొంథా తుఫాను అన్నదాత పాలిట రాక్షస పంజా విసిరిందని చెప్పవచ్చు. వరి, మొక్కజొన్న రైతుల నోటికాడికి వచ్చని పంటను తుఫాను నేలరాల్చి రైతు కుటుంబాల్లో వేదన మిగిలించింది. వాతావారణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా జిల్లా వ్యాపితంగా రెవెన్యూ సిబ్బంది కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. మొంథా తుఫాను కారణంగా నష్ట తీవ్రతను వీలైనంద ఎక్కువ తగ్గించే క్రమంలో కలెక్టర్ అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేశారు. ఎస్పీ సునీల్ షెరాన్ సైతం తన దైన శైలిలో తుఫాను వల్ల ప్రజలను అప్రమత్తం చేస్తు ప్రజా రక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనితీరుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం యావత్తు కృషి చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో కుందూ, శ్యామ కాలువలు పట్టణవాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కుందూ ఉదృతిని పెంచిన కుందూ ప్రభావం పట్టణంతో పాటు పరివాహక గ్రామలలో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కాగా పాలేరు నదిలో ప్రవాహ కదలికలు ఎక్కువగా ఉండటం తో పాలేరు అనుసంధానమైన శ్యామ కాలువ ప్రవా హంపై ఆందోళన నెలకొనింది. కుందూ, శ్యామ కాలు వలు ఉగ్రరూపం దాలిస్తే జరిగి నష్ట తీవ్రత ఉహించటం కష్టమే. నంద్యాల పట్టణనికి రక్షణ కల్పించేలా ఉండటం ముదావాహం. పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ, స్టేట్ బ్యాంక్ కాలనీ, సాయిబాబా నగర్, హరిజన వాడ తదితర లోహరిజనవాడలు జలమయమయ్యాయి.

వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మంత్రి, జిల్లా కలెక్టర్‌లు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: మొంథా తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నంద్యాల పట్టణంలో లోతట్టు ప్రాంతాలలో ఏర్పడిన పరిస్థితులపై రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజ కుమారి బుధవారం ఉదయం క్షేత్ర స్థాయిలో విస్తృత తనిఖీ చేపట్టారు. అధికార యంత్రాంగంతో కలిసి, నీరు ఎక్కువగా ప్రవహిస్తున్న ప్రాంతాలైన కుందునది పరివాహక ప్రాంతం, వైఎస్సార్ నగర్ ఏరియా, పెద్దకోటల, శ్యాంనగర్ చామకాలువ, శ్రమదానం బ్రిడ్జి, ఎస్బిఐ కాలనీల్లో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. నీటి ప్రవాహం, కాలువల సామర్థ్యం, నివారణ చర్యలపై వారు సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు తమ ప్రాంతాలలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ "ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యమని, కాలువలకు నీరు అధికంగా వస్తున్న నేపథ్యంలో, నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించడం జరిగింది. అనవసరంగా ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని, సహాయక శిబిరా లను సిద్ధంగా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయ కులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, నంద్యాల టిడిపి మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: తుఫాన్ వల్ల ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరద నీరుకు గురైన లోతట్టు ప్రాంతాలను రూరల్ తహసీల్దార్ శ్రీవాణి డిప్యూటీ తాసిల్దార్ రామచంద్రరావు ఆధ్వర్యంలో బుధవారం గ్రామాలను పరిశీలించారు. ప్రధానంగా మైనార్టీ సంక్షేమ అభివృద్ధి రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల బృందం కుందు పరివాహక ప్రాంతాలైన గ్రామాలను పర్యటించి, పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీవాణి, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రరావులు మాట్లాడుతూ మంత్రి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండలంలోని ప్రజల స్థితిగతులను తెలుసుకున్నారు. కుంద నదిలో భారీగా వరద నీరు చేరడంతో కుందూ నది పరివాహ ప్రాంత గ్రామాలైన చాపిరేవుల, మిట్నాల, గుంతనాల, బ్రాహ్మణపల్లి అలాగే భీమవరం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మట్టి మిద్దెలలో జీవనం సాగించేవారు. సురక్షితమైన ప్రాంతాలైన సచివాలయాల కార్యాలయాలు, పాఠశాలల్లో ఉండాలన్నారు. కాగా ఇంక రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉండడంవల్ల పాఠశాలలకు కళాశాలలకు జిల్లా అధికారులు సెలవులు ప్రకటించడం జరిగిందన్నారు. అందువల్ల పిల్లలు యువకులు పెద్దలు అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లరాదని ఆయా గ్రామాల ప్రజలకు తెలియజేశారు. ముఖ్యంగా కుందునది పరిసర ప్రాంతాలకు ఎవరు వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు.

పట్టణానికి పల్లెలకు రాకపోకలు బంద్: కుందునదికి వరదనీరు భారీగా చేరి బ్రిడ్జి ఎక్కి ప్రవహిస్తుండడంతో నంద్యాల పట్టణానికి పల్లెలకు రాకపోకలు బంద్ అయ్యాయి. రాయమార్పురం, పులిమద్ది, పోలూరు గ్రామాలకు, నందమూరి నగర్, వైఎస్సార్ నగర్, ఎస్సార్ బీసీ కాలనీలకు, భీమవరం గ్రామానికి రాకపోకలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్న మని అధికారులకు తెలిపారు. డీటీ నాగరాజు, విఆర్ఓ ఖాజా హుస్సేన్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా హామీ ఇచ్చారు. బుధవారం ఆమె ఆళ్లగడ్డ మండలంలోని కోట కందుకూరు గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. వరి, మొక్కజొన్న పంట సమస్యలను బాధిత రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ తుఫాను తీవ్రత కారణంగా భారీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో శ్రీశైలంలో అత్యధికంగా 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఆళ్లగడ్డ, నంద్యాల ప్రాంతాల్లో 10 సెంటీమీటర్ల పైగా వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. నల్లమల అడవులలో భారీ వర్షం కురవడంతో అక్కడి నుండి కాలువల ద్వారా నీళ్లు దిగువ ప్రాంతంలోకి చేరడంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని సహాయక చర్యలను ప్రభుత్వం చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా నంద్యాల జిల్లా గురించి అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. ఆళ్లగడ్డ ప్రాంతంలో ప్రధానంగా రైతులు అత్యధిక విస్తీర్ణంలో వరి పంటతో పాటు మొక్కజొన్నను సాగు చేయడం జరిగిందన్నారు. కోతకు వచ్చే దశలో వరి పంట భారీ వర్షాలకు దెబ్బతినడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఐదు లక్షల మెట్రిక్ టన్నులు వడ్లను రైతులు పండించడం జరుగుతుందని తెలిపారు. నష్టపోయిన రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రాజకుమార్ గణియా హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు, వ్యవసాయ శాఖ ఏడిఏ విజయ శేఖర్, ఏవో కిషోర్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్, ఆళ్లగడ్డ ఉద్యానవన శాఖ అధికారి దస్తగిరి, సంబంధిత విఆర్వోలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద ముంపు గ్రామాలను సందర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పాణ్యం : మొంథా తూఫాన్ వరద బీభత్సం సృష్టించడంతో పాణ్యం మండలంలోని తొగర్చేడు, పాణ్యం గ్రామాలలో పంటలు నీట మునిగి, మట్టి మిద్దెలు కూలిపోయి పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. వరద ముంపు గ్రామాలలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి బుధవారం పర్యటించి పంట పొలాలను, కూలిన మట్టి మిద్దెలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద ప్రభావంతో నష్టపోయిన రైతులు, ప్రజలందరూ ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇవ్వడం జరిగింది. వరి, మిరప, మొక్కజొన్న, మినుము, పొగాకు, జొన్న పంటలు పెద్ద ఎత్తున నష్టపోవడం జరిగిందన్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. పంట నష్టం అంచనా వేసి నివేదికలు పంపించినట్లయితే ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. పాణ్యం మండల వ్యాప్తంగా సుమారు వందల ఎకరాలలో వివిధ పంటలు నష్టం వాటిలిందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పూర్తిగా అప్రమత్తంగా ఉండి పునరావాస కేంద్రాలకు వెళ్లి సురక్షితంగా తలదాచుకోవాలన్నారు. కొన్ని గ్రామాలలో ఊరి ముందర బ్రిడ్జి నిర్మాణాలు ఎత్తు పెంచినట్లయితే ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి అయా గ్రామాల టిడిపి నాయకులు విన్నవించడం జరిగింది. సమస్యలను త్వరితగతన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, వ్యవసాయ అధికారి జయప్రకాష్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు జయరాం రెడ్డి, ఎంపిటిసి రంగ రమేష్, టిడిపి నాయకులు రమణా రెడ్డి, రమణమూర్తి, గుజ్జుల సుబ్బయ్య, దానం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జల దిగ్బంధనంలో అనుపూరు గ్రామం

విశాలాంధ్ర - పాణ్యం : మొంతా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజుల నుండి మండల వ్యాప్తంగా కురు స్తున్న భారీ వర్షాలకు మట్టి మిద్దెలు కూలి, వాగులు, వంకలు ఉప్పొంగడంతో కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో ఇరుక్కున్నాయి. వివరాలలోకి వెళితే మండల పరిధిలోని అనుపూరు గ్రామం కుందూ నది ఒడ్డున ఉన్న రైతుల పొలాలు మినుము, మిరప పంటలు జొన్న, మొక్కజొన్న శనిగ పంటలు నీట మునిగినవి. దాదాపు వెయ్యి ఎకరాల పంట నష్టం జరిగినట్టు అనుపూరు గ్రామ ప్రజలు తెలిపారు. గ్రామం మొత్తం చుట్టూ నీరు చేరడం తో రాక పోకలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ రైతులు శరభయ్యా, నారాయణ స్వామి జయరాం, రాజేష్ మాట్లాడుతూ జొన్న, మొక్క జొన్న, పొగాకు, మిరప, వరీ, శనగ అన్నిరకాల పంట కోతకు సిద్ధంగా ఉన్నాయని, పంట నీట మునిగి మొలకెత్తడంతో రైతులు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. చేతికొచ్చిన పంటలు తమ కళ్ళముందే వరద ముంపునకు గురి కావడంతో రైతన్నలు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలనన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పాక్షికంగా దెబ్బతిన్న మట్టి మిద్దెలలో ఉండే ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని రెవెన్యూ అధికారులు, పోలీసులు ఆయా గ్రామాలలో దండోరా వేయించి ప్రజలందరూ అప్రమత్తం చేయడం జరిగింది. తాహసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ తుఫాను ప్రభావం పై ప్రజలకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. మండల అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు, వీఆర్వో, సర్పంచ్ రెవెన్యూ సిబ్బంది వాగులు వంకలు, లోతట్టు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేశారు.

రైతులు ఎవరు ఆందోళన చెందవద్దు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నియోజకవర్గంలో మొంథ తుపాన్ వల్ల నీట మునిగిన పంటలను అధికారులతో కలిసి ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పరిశీలించారు. నియోజకవర్గంలోని దొర్నిపాడు మండలం డబ్ల్యా. గోవిందిన్నె గ్రామంలో తుఫాను వర్షాలకు నీట మునిగిన పంటలను ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలాగా చూడాలని ప్రజలెవరు ఇబ్బందులకు గురికాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. గ్రామ నాయకులు, మండల అధికారులందరూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సావిత్రి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు ఎరువ ప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

విలవిల్లాడిన ఆత్మకూరు

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: మొంథా తుఫాన్ దాటికి ఆత్మకూరు విలవిలలాడి పోయింది. అర్ధరాత్రి నుండి కురిసిన భారీ వర్షానికి ఆత్మకూరు పట్టణంతోపాటు పరిసర గ్రామాలు కకావికులమైంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నల్లమల అటవీ ప్రాంతంలోని సిద్దాపురం చెరువు, వరదరాజ స్వామి ప్రాజెక్టులు నిండాయి. సిద్దాపురం చెరువుకు గండిపడే అవకాశం ఉండడంతో అధికారులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చెరువును పరిశీలించి ముందస్తు చర్యలు చేపట్టారు. సిద్దాపురం చెరువు నుండి అలుగు ద్వారా కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై వరద నీరు భారీగా ప్రవహిస్తుంది. దీంతో విజయవాడ గుంటూరు శ్రీశైలం రాకపోకలను పూర్తిగా అధికారులను నిలిపివేశారు. వరదరాజ స్వామి ప్రాజెక్టు గేట్లు ఎత్తి కిందికి నీటిని విడుదల చేశారు దీంతో కొత్తపల్లి మండలంలోని సుమారు 22 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వడ్ల రామాపురం గ్రామం వద్ద మల్లెలమ్మ చెరువుకు గండిపడడంతో గ్రామస్తులు అప్రమత్తమై వెంటనే పూడ్చివేశారు. ఆత్మకూరు పట్టణంలోని పలు కాలనీలు నీట మునగడంతో ఇళ్లలోకి నీరు చేరి, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ యార్డులో ఆరపోసుకున్న సుమారు 400 ప్యాకెట్ల మొక్కజొన్న పంట పూర్తిగా నీటిలో మునిగిపోయింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ రెవిన్యూ, పోలీస్ అధికారులతో కలిసి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు

వర్షానికి కూలిన మట్టిమిద్దేలు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో మొంతా తుఫాన్ వలన కురిసిన భారీ వర్షానికి బుధవారం తెల్లవారుజామున బోయ రవణమ్మ మట్టిమిద్దే కూలిపోయింది. ఇంట్లో ఆమె నిదురిస్తుండగా మిద్దెక్కున్న రెండు దూలాలు విరిగిపడ్డాయి. ఒక్కసారిగా భారీగా శబ్దం రావడంతో వెంటనే రవణమ్మ బయటికి పరుగు తీయడంతో ప్రాణాపాయం తప్పిందని ఆమె తెలిపారు. ఉండడానికి ఇల్లు లేదని, ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసి నూతనంగా ఇల్లు మంజూరు చేయాలని ఆమె అదికారులను కోరారు.

విశాలాంధ్ర - చాగలమర్రి : మండల వ్యాప్తంగా తుఫాను ప్రభావంతో 44మట్టిమిద్దెలు కూలాయి. మండలంలోని గొట్లూరులో మూడు, చిన్న బోధనంలో మూడు, పెద్దబోధనంలో 5, ముత్యాలపాడు, గొడిగనూరు, నేలంపాడు తదితర గ్రామాల్లో కలిపి 44మట్టిమిద్దెలు కూలాయని అధికారులు గుర్తించారు. చాగలమర్రి పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవాలయం ప్రహరీ గోడ కూలింది. కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

విశాలాంధ్ర - బనగానపల్లె: మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలోని ఈద్గా నగర్ కాలనీలో సుబ్బారెడ్డి, వెంకట లక్ష్మమ్మ మట్టి ఇల్లు కూలడం జరిగింది. ఇంటి యజమాని రాత్రి 11 గంటల సమయంలో శబ్దం రావడం గమనించి అప్రమత్తమై కుటుంబ సభ్యులు బయటికి రావడం జరిగింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తమకు పక్క ఇల్లు నిర్మించి ఆదుకోవాలని కోరారు.

తుఫాన్ ప్రభావంతో అధికారుల అప్రమత్తం

విశాలాంధ్ర - రుద్రవరం: ప్రస్తుతం మొంత తుఫాన్ ప్రభావంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ అధికారులకు ఆదేశించారు. మండలంలోని ఆలమూరు పరిసర ప్రాంతంలో రైతులు పండించిన ధాన్యాన్ని, తుఫాన్ ప్రభావంతో నేలవాలిన పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ధాన్యపు గింజల నష్టా లను, దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలించి, రైతులతో ముఖా ముఖి గా మాట్లాడి పంటల నష్టాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం తుఫాన్ ప్రభావంతో అధికారులు అప్రమత్తమైన తీరును వివరాలను పునరావాస కేంద్రాల ఏర్పాటు, గ్రామాలలో తుఫాన్ వల్ల కూలిన నివాసాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభా వంతో ప్రజలకు ప్రాణ నష్టం ఆస్తి నష్టాలు జరగకుండా ఉండేందుకు అధికారులు యుద్ధప్రాతిపాదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల తహసిల్దార్ ఆల్ఫ్రెడ్, వ్యవసాయ అధికారి సుమతి, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ శాఖ అధికారులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు, పలువురు ఉన్నారు.

శ్రీశైలంలో వరద బీభత్సం

విశాలాంధ్ర - శ్రీశైలం: మొంథా తుఫాన్ శ్రీశైలంలో వరదబీభత్సం సృష్టించింది. శ్రీశైలంలోని రోడ్లన్నీ జలమయ మైపోయాయి. బీసీ కాలనీ. శ్రీగిరి కాలనీ, పాతాళ గంగ మెట్ల మార్గం వరదతో ఉప్పొంగిపోయింది. కొత్తపేట శ్రీగిరి కాలనీలో ఇళ్లల్లో నుంచి నీళ్లు వాగుల ప్రవహిస్తున్నాయి. రోడ్లన్నీ జలమయమై వాగులను తలపిస్తున్నాయి. వర్ష కారణంగా ఇండ్లలో నుంచి స్థానికులు బయటకు వచ్చే పరిస్థితి లేనందున స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్లల్లోకి నీళ్లు చేరటంతో స్థానికులు రాత్రి అంతా తమతమ కుటుంబ సభ్యులతో నిద్ర లేకుండా గడిపారు. పాతాళగంగ రూప్ వే దగ్గర వర్షానికి కొండ చర్యలు విరిగిపడటంతో మూడు షాపులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఆ సమయంలో స్థానికులు దుకాణదారులు ఎవరు లేకపోవటంతో ప్రమాదం తప్పింది. వర్షంతో నల్లమల అడవిలో వాగులు, వంకలు పొంగి పొర్లడంతో శ్రీశైలం నుండి దోర్నాల వెళ్లే రహదారి మూసివేసి వాహన రాకపోకలను నిలిపివేశారు. శిఖరం వద్ద వాహనాలు నిలిచిపోవడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా దేవస్థాన కార్య నిర్వహణ అధికారి శిఖరం వద్ద నిలిచినా వాహనాల్లో ఉన్న భక్తులకు అల్పాహారం భోజనం ఏర్పాట్లను తానే స్వయంగా పంపిణీ చేయించారు. అధికారుల సమన్వయంతో వాహనదారులు క్షేమంగా వెళ్లాలని సూచించారు.

ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: దేశ స్వాతంత్ర పోరాటంలో కార్మిక వర్గాన్ని చైతన్యం చేసి అగ్రభాగాన నిలబడి బ్రిటిష్ వారిని తరిమి కొట్టడంలో కీలక పోరా ట భూమిక పోషించిన మొట్టమొదటి భారతదేశ కార్మిక సంఘం ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ఏర్పడిం దని, 105వ ఆవిర్భావ దినో త్సవాన్ని జిల్లాలో వాడ వాడలా అన్ని రంగాల కార్మికులు పతాకా విష్కరణ చేసి జయ ప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, ఎం.రమేష్ బాబులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో ముఖ్య నాయకులతో కలిసి వారు మాట్లాడారు. జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో కార్మిక అడ్డాలో ఏఐటీయూసీ జెండాలు ఆవిష్కరించి ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహించి కార్మిక ఐక్యతను చాటి ఏఐటియుసి పోరాట చరిత్రను అశేష త్యాగాలను తెలియజేసేలాగు వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులు హరిస్తు కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోళ్లుగా మార్చి కార్పొరేట్ కనుకూలంగా మార్చిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు భాస్కర్, శ్రీను, మక్బుల్ భాష ప్రతాపు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 30, అక్టోబరు 2025

బస్సు ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో హల్‌చల్

నిజం నిగ్గు తేల్చాలంటున్న ప్రజలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: చిన్నటేకూరు సమీపంలో జాతీయ రహదారిపై 19 మంది సజీవదహనమైన సంఘటనపై సోషల్ మీడియాలో విపరీతంగా అనుమానాలు వ్యక్తం చేస్తూ ప్రచారం జరుగుతుంది. సంఘటనకు బాధ్యులు ఎవరు డ్రైవర్‌రా, లేక మద్యం మత్తులో బైక్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన శివశంకరా, లేక మరో వ్యక్తి ఎర్రిస్వామినా అన్న దానిపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. డ్రైవర్ అజాగ్రత్తనే ప్రమాదానికి కారణమన్న విషయం తెలిసిందే. ద్విచక్ర వాహనం ప్రమాదం జరిగి, రోడ్డుపై పడిపోయిన తరువాత అదే రహదారిపై సుమారు 19 వాహనాలు ద్విచక్ర వాహనాన్ని గుర్తించి పక్కకు పోతే, మరి కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ద్విచక్ర వాహనాన్ని ఎందుకు గుర్తించ లేకపోయాడు అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఓసారి తాను చీకట్లో వాహనం గుర్తించలేక పోయానని, మరోసారి బస్సు వేగంగా పోతున్నందున బ్రేక్ వేస్తే బస్సు కంట్రోల్ కాకపోగా ప్రమాదం జరుగుతుందని తాను బ్రేక్ వేయలేదని డ్రైవర్ చెప్పినట్లుగా ప్రచారం జరుగుతుంది. దీనిలో ఏది నిజం అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏది ఏమైనా 19 మంది మాత్రం సజీవదహనం అయ్యారు. ఎన్నో కుటుంబాల్లో విషాదం మిగిల్చింది. ఆకుటుంబాలకు జరిగిన లోటును ఎవరూ పూడ్చలేనిది. ఆ రోజు రాత్రి ఏం జరిగింది, ఎలా జరిగింది.. ఈ దారుణ మారణకాండకు బాధ్యులు ఎవరు అన్న విషయం నిగ్గుతేల్చాల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉంది. ప్రమాదం జరిగిన బస్సులో డబ్బులకు కక్కుర్తి పడి డ్రైవర్‌లు సెల్‌పోన్‌లు రవాణా చేయడం కూడా ఈ ప్రమాద తీవ్రతకు ఓ కారణంగా ప్రచారం జరుగుతోంది. ఆ రోజు రాత్రి బస్సు నడిపింది నిజంగా లక్ష్మణా, లేక మరో డ్రైవరా అన్నది కూడా అనుమానం వ్యకం చేస్తున్నారు. ఏది ఏమైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ఈ సంఘటనపై నిజాలను నిగ్గుతేల్చి ప్రజలకు తెలియచేయాల్సిన అవసరం అటు ప్రభుత్వం, ఇటు అధికారులపై ఉంది. పోలీసులు అయితే లక్ష్మయ్యను మంగళవారం అరెస్టు చేశారు.

నగరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదాం : మంత్రి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ, అగ్రగామిగా నిలుపుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో కమిషనర్ పి. విశ్వనాథ్‌తో కలిసి అన్ని విభాగాల అధికారులు, అమినిటీస్ కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ముందుగా నగరంలో రూ.12.62 కోట్లతో జరుగుతున్న 62 అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్ల వారీగా సమీక్ష నిర్వహించారు. జాప్యం జరుగుతున్న పనులపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలస్యం చేసే కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కర్నూలుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రగతిలో ముఖ్య స్థానాన్ని ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సుముఖంగా ఉందని, దీన్ని నగర శివార్లలో కాకుండా బీ, సీ క్యాంపుల్లో ఏర్పాటు చేసే అంశంపై ఇటీవల విదేశీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి సైతం దీనిపై సానుకూలంగా ఉన్నారని తెలిపారు. 160 ఎకరాలకు పైగా భూమి ఉందని, ఎకరా 100 కోట్ల వరకు విలువ ఉందని, దీన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటామన్నారు. వాటిలోనే స్మార్ట్ సిటీ ప్రాజెక్టులకు స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరిం చారు. బుధవారపేట మెడికల్ కాలేజీ మలుపు వద్ద ఉన్న షాపుల అంశం న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకు నడుచుకుంటామని తెలిపారు. అనంతరం రహదారుల విస్తరణ, పారిశుద్ధ్యం, టిడ్కో గృహాలు, గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతి తదితర అంశాలపై నగరపాలక అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ఇన్‌చార్జ్ ఎస్ఇ శేషసాయి, ఆర్‌ఓలు జునైద్, స్వర్ణలత, వాజీద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష పాల్గొన్నారు.

పత్తి, మిరప పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని రాగిమాన్ దొడ్డి గ్రామంలో పత్తి, మిరప పంటలను బుధవారం మండల వ్యవసాయ అధికారిణి సుచరిత ఆధ్వర్యంలో కర్నూలు డాట్ కేంద్రంకు చెందిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ, శాస్త్రవేత్త డాక్టర్ సతీష్, ఏడీఏ బాల వరదరాజు పరిశీలించారు. వివిధ పంటలలో అధిక వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పత్తి పంట నీటి ముంపుకు గురైనప్పుడు ఆకులు ఎర్రబడటం, మొక్కలు వాడపోవడం, కాయలు కుళ్ళిపోవడం జరుగుతుందన్నారు. నీటి ముంపు పరిస్థితి ఉన్నప్పుడు, మురుగు నీటిని తొలగించడంతో పాటు ఎండగా ఉన్న సమయంలో పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు ప్రతి లీటరు నీటికి లేదా నానో యూరియా 2-4 మి.లీ. ప్రతి లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో మారుమారుగా పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్వేత, రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

జీడీపీని పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-గోనెగండ్ల: మండల పరిధిలోని బుధవారం గాజులదిన్నె ప్రాజెక్ట్‌ను కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ప్రాజెక్ట్ వద్ద సాగు నీటి సరఫరా పరిస్థితులు, జలాశయం నీటి నిల్వ స్థాయి, సాగు కాల్వల నిర్వహణ పనులు, మరమ్మత్తులు తదితర అంశాల గురించి ఇరిగేషన్ ఎస్‌ఈ ని అడిగి తెలుసుకున్నారు. 4.5 టీఎంసీ సామర్థ్యం ఉన్న వాటిని 5.5టీఎంసీ సామర్థ్యం పెంచినందుకుగాను బండ్ ఎత్తు, విస్తీర్ణం పెంచుకుంటూ వెళ్ళారని అందుకు సంబంధించిన పనులు, ఇంకా కొన్ని మరమ్మతుల పనులు నిధులు విడుదల కాక ఆగిపోయాయని ఇరిగేషన్ ఎస్‌ఈ కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా సంబంధిత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదోని ఇంచార్జి ఆర్డీఓ అజయ్, ఇరిగేషన్ ఎస్‌ఈ బాల చంద్ర రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌ఈ పాండురంగయ్య, ఇరిగేషన్ ఏఈ మహమ్మద్ అలీ, ఉగ్ర నరసింహ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయండి

విశాలాంధ్ర -హొళగుంద: మండల ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని మండల టీడీపీ నాయకులు గోవిందు గౌడ్, అబ్దుల్ సుభాన్, ముద్దన గౌడ్, మొయిన్, వలి బాషా, జాకీర్ బీ, అబ్దుల్ రెహమాన్, హుస్సేన్ పీరా ఈబదుల్ల, సుబాన్, తాహెర్, ఇలియాస్‌లు కోరారు. బుధవారం ఆలూరు టీడీపీ నియోజకవర్గ ఇంచార్జీ వైకుంఠం జ్యోతికి వారు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో దాదాపు 40 వేల జనాభాకు వైద్య సేవలు అందుతున్నాయని, జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రభుత్వాసుపత్రిని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే మండల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆసుపత్రి విస్తరణకు తగినంత భూమి, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, స్థానికులు, ప్రజా ప్రతినిధులు ఈ ప్రతిపాదనకు పూర్తిగా మద్దతు ఇస్తున్నారని తెలిపారు.

వర్షానికి కూలిన గుడిసె

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో కురిసిన భారీ వర్షానికి కటిక కాశిం బీ, పెద్ద రాజాసాహెబ్ దంపతులకు చెందిన గుడిసె కూలింది. విషయం తెలుసుకున్న గ్రామ వీఆర్వో కృష్ణ మూర్తి, టిడిపి మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి ముక్కన్నలు బుధవారం గుడిసెను పరిశీలించారు. వీఆర్వో మాట్లా డుతూ భారీ వర్షాలకు దెబ్బతిని కూలిన గుడిసె ఘటనపై ప్రాథమిక నివేదిక తయారు చేసి, తహసీల్దార్‌కు అందజేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

నేడు పత్తి రైతుల రాష్ట్ర సమ్మేళన ఆహ్వాన సంఘం కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: నేడు ఆదోని పట్టణంలోని ఆస్పరి రోడ్ నందు గల ఆవకాయ రెస్టారెంట్‌లో ఉదయం 11 గంటలకు పత్తి రైతుల రాష్ట్ర సమ్మేళనం ఆహ్వాన సంఘం కమిటీని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామ చంద్ర య్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగ న్నాథం ఆధ్వర్యంలో ఎన్నుకుంటున్నట్లు సీపీఐ ఆదోని పట్టణ కార్యదర్శి టి.విరేష్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పత్తి రైతుల సమస్యలు పరిష్కారం కోసం నవంబర్ 18, 19 తేదీల్లో రాష్ట్ర సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఈ సమ్మేళనం జయప్రదం చేయటం కోసం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథంతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్న గౌడ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. సమావేశానికి సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణంలోని భాస్కర్‌రెడ్డి నగర్, రజకుల కాలనీల్లో సీసీ రోడ్లు, మురికినీటి కాలు వలు ఏర్పాటు చేయా లని సిపిఐ మండల కార్యదర్శి బి.రాజు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక విజయ భాస్కర రెడ్డి నగర్, రజకుల కాలనీల్లో సిపిఐ బృందం పర్యటించి కాలనీ పరిసరాల్లో వర్షపునీటి నిల్వలను పరిస్థితులను పరిశీలించింది. ఈ సందర్భంగా బి.రాజు, ఏఐటియుసి తాలూకా కార్యదర్శి మద్దూరు చిన్న రాముడులు మాట్లాడుతూ గత ఎన్నో ఏళ్లుగా ఈ కాలనీలో సీసీ రోడ్లు లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారన్నారు. మురికినీరు నిల్వ ఉండటంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతు న్నాయన్నారు. రోడ్లు లేక పాములు, తేళ్లు తిరుగుతుండటం ప్రజలకు ముప్పుగా మారిందని తెలిపారు.అధికారులు వెంటనే స్పందించి కాలనీలో సీసీ రోడ్లు, మురికినీటి కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందో ళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, మద్దిలేటి, కాలనీ ప్రజలు, లక్ష్మీదేవి, సుంకులమ్మ, రాజు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - కోడుమూరు: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్యాలకుర్తి గ్రామ పరిధిలో పత్తి, కంది, పప్పు శనగ తదితర పంటలను వ్యవసాయ శాఖ జిల్లా శిక్షణ కేంద్రం ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లు, ఏవో వెంకట రంగారెడ్డిలు పరిశీలించారు. బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎన్.రవిప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో మొంథా తుఫాను కారణంగా కురిసిన వర్షాల నేపథ్యంలో పంటల పరిస్థితిపై వ్యవసాయ అధికారులు సమీక్ష నిర్వహించారు. జిల్లా శిక్షణ కేంద్రం ఏడీఏ యస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు భవిష్యత్తులో ఇలాంటి తుఫానుల వల్ల నష్టపోకుండా ఉండేందుకు మిశ్రమ పంటల సాగు విధానం పాటించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కర్నూలు నుండి విజయవాడకు వెళ్ళు బస్సులు నంద్యాల మీదుగా మళ్ళింపు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : గత నాలుగు రోజులు నుండి కురుస్తున్న అధిక వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆత్మకూరు సమీపంలోని సిద్దాపురం చెరువు అలుగు పారడంతో ఆత్మకూరు నుండి దోర్నాల వైపు పోవు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కర్నూలు నుండి విజయవాడ పోవు బస్సులు, ఇతర వాహనాలు నంద్యాల, గిద్దలూరు, బేస్తవారిపేట, దరిమడుగు, కోకోనికుంట మీదుగా మళ్ళించారు. అదే విధంగా శ్రీశైలం వెళ్లు వాహనాలు కూడా నంద్యాల, గిద్దలూరు, బేస్తవారిపేట, దరిమడుగు, దోర్నాల మీదుగా పోవలసి ఉంది. దోర్నాల నుండి శ్రీశైలం పోవు మార్గంలోని తుమ్మలబయలు వద్ద నల్లమల నుండి వస్తున్న వాగు ఉధృతికి రాకపోకలు నిలిచి పోవడంతో మంగళవారం నుండి దోర్నాలలో వాహనాలు నిలిపి వేశారు. దోర్నాల సమీపంలోని పూలసుబ్బయ్య వెలుగోండ ప్రాజెక్టు సమీపంలోని కొత్తూరు గ్రామం వద్ద దొంగలవాగు ఉధృతంగా ప్రవహించడం వలన దోర్నాల - ఆత్మకూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. కర్నూలు నుండి విజయవాడకు పోవు ప్రయాణికులు నంద్యాల మీదుగా వెళ్ళాలని అధికారులు తెలియచేస్తున్నారు. కార్తీక మాసం కావడంతో శ్రీశైల భ్రమరాంభ మల్లిఖార్జునస్వామివార్ల దర్శనంకు వెళ్ళు భక్తులు శ్రీశైలం రాకపోకలు నిలిచిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైతున్నారు. మొంథా తుఫాన్ కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత రెండు రోజుల నుండి కురుస్తున్న ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగి పొర్లు తున్నాయి. పంటలు నీటమునిగాయి. పత్తి, వరి, కంది, మొక్కజొన్న, ఉల్లి పంట నీటమునిగి రైతులు తీవ్ర ఆవేధన చెందుతున్నారు. ఖరీఫ్‌లో కురిసిన వరుస తుఫాన్‌ల కారణంగా పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదంటున్నారు. మంగళవారం రాత్రి తుఫాన్ తీరందాటడం వలన బుధవారం మద్యాహ్నాం నుండి వర్షం నిలిచి పోవడంతో ప్రజలు కొంత ఉపశమనం చెందారు.

బ్యాంకు అధికారుల తీరుపై మహిళా రైతు ఆందోళన

విశాలాంధ్ర - నందవరం: కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, మరోపక్క వరుస పంట నష్టాలతో అప్పులు తీర్చలేక సతమతమవు తున్న ఓ దళిత మహిళా రైతుకు బ్యాంక్ సిబ్బంది చేసిన పనికి ఆందోళన చెందింది. నందవరం గ్రామానికి చెందిన మాల అంజినమ్మ అనే మహిళాకు 2018లో ట్రాక్టర్‌కు రూ.3.50 లక్షలను తన కుమారులు మాల చంద్ర, ఈరన్నలు సాక్షులుగా లోన్ తీసుకున్నారు. చివరిసారిగా మూడేళ్ల కిందట రూ.2 లక్షల బకాయి కాగా సరైన వర్షాలు పడకపోవడంతో నష్టం వచ్చిందని, దీంతో లోన్ కట్టలేదని ఆమె కుమారుడు ఎం.ఈరన్న తెలిపారు. మంగళవారం తమ ఇంటికి కెనరా బ్రాంచ్ మేనేజర్, మరో ముగ్గురు, ఇద్దరు కానిస్టేబుళ్ల రావడం జరిగిందని, పంట రాలేదని రెండు నెలలు సమయం ఇస్తే కడతామన్నా వినకుండా ట్రాక్టర్ తాళాలు పగలగొట్టి ట్రాక్టర్‌ని తీసుకువెళ్లారన్నారు. బ్యాంకులో నేరుగా రుణాలు కడితే సామాన్యుల లోన్లు నెలరోజులు చేస్తే బ్యాంకులో పనిచేసే కొంతమంది మధ్య దళారులు ఇచ్చిన వాటిని మాత్రం రెండు రోజుల్లోనే ఇస్తున్నారని, ఇలాంటివి బ్యాంక్ అధికారులు కనిపించవా అంటూ ప్రశ్నించారు. తమ అమ్మపై గత 40 ఏళ్లుగా రుణాలు తీసుకుంటున్నామని, ప్రతిసారి సరిగ్గానే రుణాలు కడుతూ వస్తున్నామని, ప్రస్తుతం కట్టలేని మాట వాస్తవమన్నారు. ఇప్పటి వరకు బ్యాంకు రుణాలు సమయానికి కట్టలేదని ఎవరి పైన అయినా ఇలాగే ప్రవర్తించారా, లేక మేము దళితులను కాబట్టే మాపై ప్రతాపం చూపిస్తున్నారని అని వారు ప్రశ్నించారు. ఇలా పదిమందిలో మా మర్యాద తీస్తే మాకు మరణమే శరణ్యం అంటూ ఆమె కుమారుడు ఈరన్న ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాక్టరును తీసుకురావడం వాస్తవమే - మేనేజర్: నందవరం గ్రామానికి మాల అంజినమ్మకు చెందిన ట్రాక్టర్‌ను తీసుకురావడం వాస్తవమేనని కెనరా బ్యాంకు మేనేజర్ నాగరాజు తెలిపారు. గత సంవత్సరం నుండి మొండి బకాయి కట్టాలని నోటీసులు ఇచ్చిన రైతుల నుండి స్పందిన లేదని, దీంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపడం జరిగిందని, వారి ఆదేశాలతోనే ఏజెన్సీ వారు ట్రాక్టర్‌ను తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. బకాయిపై జిల్లా బ్యాంకు అధికారులను రైతులు సంప్రదించాలని తెలిపారు.

మార్కెట్ యార్డులో భారీ అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తు తెలియని దుండగులు ఉదయం 5 గంటల ప్రాంతంలో ఖాళీ సంచులకు పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో మంటలు భారీ ఎత్తున ఎగసి పడ్డాయి. స్థానికులు గుర్తించి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనను డిప్యూటీ డైరెక్టర్ లావణ్య తెలుసుకొని పరిశీలించారు. ఈ ఘటన కు కారకులైన ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని మార్కెట్ యార్డు ప్రత్యేక కార్యదర్శికి సూచించారు. ఈ ఘటనలో సుమారు రూ.5 లక్షల వరకూ నష్టపోయామని కమిషన్ ఏజెంట్ బాధితుడు మహబూబ్ బాష వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధనలయ్య కొండను పరిశీలించిన జేసీ

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని పెనమాడ సమీపంలో ఉన్న ధనులయ్య కొండను జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధనలయ్య కొండ పరిధి విస్తరణం ఎంత ఉంది కొండ ప్రాంతంలో సాగు చేసిన రైతులు ఎంతమంది ఉన్నారు. ఎన్ని ఎకరాలు సాగులో ఉంది కొండ ప్రాంతం పరిధిలో గల కంబాలపాడు, పెనుమాడ చుంచు ఎర్రగుడి, చిట్యాల, కోయిలకొండ తదితర గ్రామాలు పరిధిలోకి వస్తాయన్నారు. ధనలయ్య కొండకు ఇప్పటివరకు సర్వేనెంబర్ ఇవ్వలేదన్నారు. గతంలో అధికారులు కొండ ప్రాంతాన్ని పరిశీలించి, వెళ్లిన సందర్భం ఉందన్నారు. ఏదైనా ప్రభుత్వానికి అనువైన స్థలం కుదిరితే ఒక ఇండస్ట్రీ ఏర్పాటు చేయాలని ఆలోచన ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రస్తుతం సర్వే నిమిత్తం కొండ ప్రాంతానికి రావడం జరిగిందని ఆయన తెలిపారు. ఈయన వెంట పత్తికొండ ఆర్డిఓ భరత నాయక్, క్రిష్ణగిరి తాసిల్దార్ రాజేష్, వీఆర్వోలు ప్రహల్లాద, నారాయణ, గిడ్డయ్య, సర్వేలు మాధవకృష్ణ రైతులు ఉన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు సమీపంలో శ్రీ శివ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, మార్కెట్ యార్డ్ సెక్రటరీ జి.చంద్రమౌళి పూజ చేసి సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూపత్తి పంటను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారికే మాత్రమే విక్రయించాలని, ప్రైవేట్ ట్రేడర్స్ దగ్గర విక్రయిస్తే చాలా తక్కువ ధర వస్తుందని రైతులకు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలతో పంట దిగుబడి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-గోనెగండ్ల: నాణ్యమైన విత్తనాలతో పంట దిగుబడి పెరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి అన్నారు. బుధవారం మండలంలోని కులుమాల గ్రామంలో జాతీయ ఆహార నూనె గింజల పథకం (2025-26) పథకం కింద జిల్లా కలెక్టర్ వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆహార నూనె గింజల పథకం (2025-26) పథకం కింద జిల్లాలో రబీలో గోనెగండ్ల, ఎమ్మిగనూరు, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర 5 మండలాల్లో 500 హెక్టార్లకు రూ.85.50 లక్షల విలువగల 750 క్వింటాల్ ల వేరుశనగ కాయలను ఉచితంగా ఇస్తున్నామన్నారు. రైతుకు ఒక హెక్టార్ చొప్పున అందుకు సరిపడా విత్తనాన్ని ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం రైతులకు పంపిణీ చేసే వేరుశనగ టీసీజీఎస్ 1694 విత్తనం చాలా మంచి విత్తనం అన్నారు. మండలంలో 100 హెక్టార్ల కు రూ.17.10 లక్షల విలువ గల 150 క్వింటాళ్ల వేరుశనగను విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ పథకం కింద కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి టెక్నికల్ సపోర్టింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. రైతులకు విత్తనం వేసినప్పటి నుంచి పంట విక్రయించేంత వరకు కేవికే రైతులకు అన్ని రకాలుగా సలహాలు, సూచనలు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆదోని ఇంచార్జి ఆర్డీఓ అజయ్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, పశు సంవర్థక శాఖ అధికారి శ్రీనివాస్, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ రాఘవేంద్ర, వ్యవసాయ ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత, ఎంపీడీవో మణి మంజరి, తహశీల్దార్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టెట్‌పై రివ్యూ పిటీషన్ హర్షనీయం : ఎస్టీయూ

విశాలాంధ్ర-పత్తికొండ: టెట్‌పై రివ్యూ పిటిషన్ వేయడం హర్షనీయమని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్స్ కొత్తపల్లి సత్యనారాయణ, కుంపటి నారాయణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డిలు అన్నారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో మండల అధ్యక్షులు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు టెట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాలనే అంశంపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయుటకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. 2011కు ముందు డీఎస్సీల ద్వారా ఎంపికైన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని, వారి ఆందోళనను అర్థం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి రివ్యూ పిటిషన్ వేయడం శుభ పరిణామం అన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ మొదలుపెట్టాలని కోరారు. ఎస్టీయూ మండల కార్యదర్శి బలరాం, ఆర్థిక కార్యదర్శి మారుతి, తుగ్గలి మండల అధ్యక్ష, కార్యదర్శులు సంజీవయ్య, సూరి, నాయకులు బీరప్ప, వెంకట రాముడు, చెన్నకేశవరావు, కౌలుట్లయ్య, మండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికై జరుగు బస్సు జాతను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగు బస్సు జాతను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక యూనివర్సిటీ నందు బస్సు జాత గోడ పత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యారంగంలో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారంలో ఉన్న జగన్ మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలల సీట్లను అమ్మకానికి పెట్టారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు విమర్శించి, నేడు కూటమి ప్రభుత్వం పూర్తిగా పిపిపి విధానం ద్వారా ప్రైవేటీకరణకు తెర లేపడం సమంజసం కాదని దుయ్యబట్టారు. ఈ నెల 22 తేది నుండి నవంబర్ 12 తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాత నిర్వహిస్తున్నామని, నవంబర్ 10న కర్నూలు నగరంలో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సభకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ నాయకులు ఆలీ, ఈశ్వర్, మధు, గణేష్, నబీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎంపీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద ప్రజలకు వరం లాంటిదని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆలూరు మండలం హులేబీడు గ్రామానికి చెందిన గొల్ల నాగన్నకి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద అందిన ఆర్థిక సహాయాన్ని ఎంపీ తన కార్యాలయంలో అందజేశారు. నాగన్న అనారోగ్య సమస్యలతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల కోసం ఎంపీ నాగరాజును సంప్రదించి, ఆయన సిఫార్సుతో సీఎం రిలీఫ్ ఫండ్‌కి దరఖాస్తు చేసుకోగా రూ.50,431 మంజూరు అయ్యాయి.

సొంత నిధులతో వార్డులో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - ఆదోని క్రైం: వార్డులో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని కౌన్సిలర్ వెల్లాలి లలితమ్మ తెలిపారు. బుధవారం ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు అమరావతి నగర్ కాలనీలోని మట్టి రోడ్డుకు ఇరువైపులా సిమెంటు రోడ్లు డ్రైనేజీలు లేకపోవడం వల్ల విపరీతమైన ముళ్ళకంప చెట్లు పెరిగి రోడ్డుపైన నడవడానికి వీలు కావడం లేదని, కాలనీ యువకులు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ దృష్టికి తీసుకువెళ్ళిన వెంటనే స్పందించి, సొంత నిధులతో జెసిబి ఏర్పాటు చేసి ముళ్ళకంపచెట్లు తొలగించడమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు చేసి, వర్షాల వల్ల నిల్వ ఉన్న నీరు బయటకు వెళ్ళే ఏర్పాటు చేయించడం జరిగిందని కాలనీవాసులు తెలిపారు. అడిగిన వెంటనే స్పందించిన కౌన్సిలర్ లలితమ్మకు వార్డు ప్రజలు, యువకులు వడ్డే అశోక్, వాల్మీకి వినోద్, శశిధర్,అమరేష్, ధనుష్, జనార్ధన్, కల్యాణ్,ముకుంద, సురేష్, రఘు, మహేష్, శకుంతల, తాయమ్మ, ఆదిలక్ష్మీ,తాయప్ప, సరస్వతి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నూర్జహాన్, పరుశురాం పాల్గొన్నారు.

అధిక వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు

విశాలాంధ్ర - సి.బెళగల్: మొంథా తుఫాన్ కారణంగా కురిసిన అధిక వర్షాల వల్ల వివిధ పంటలలో తీసుకోవలసిన చర్యలపై మండల వ్యవసాయ అధికారి జి.మలేష్ కుమార్ రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. మండల పరిధి లోని ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించి, మొంథా తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలతో వివిధ రకాల పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ముఖ్యంగా పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది వివిఎ ఆసిఫ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు జూడో క్లస్టర్ గేమ్స్‌లో వెండి, కాంస్యం పతకాలు గెలుచుకున్న ఆర్ఎస్సై

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జాతీయ పోలీసు జూడో క్లస్టర్ ఆటల పోటీల్లో వెండి, కాంస్యం పతకాలు సాధించిన కర్నూలు ఆర్ముడు రిజర్వుడు ఆర్ఎస్సై పి.కల్పనను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. 2025 ఈ నెల 8 నుండి 6 వరకు జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలో జరిగిన వదో జాతీయ పోలీసు జూడో క్లస్టర్ ఆటల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున కర్నూలు జిల్లా పోలీసుశాఖ నుండి ఆర్ ఎస్సై కల్పన పాల్గొన్నారు. పెన్కాక్ సిలాట్‌లో ఒక వెండి పతకం, కరాటేలో కాంస్య పతకం ఆర్ ఎస్సై కల్పన సాధించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని, జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జావేద్ ఉన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 30, అక్టోబరు 2025

మండలంలో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం

విశాలాంధ్ర - ఆలూరు : మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశాన్ని టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి అధ్యక్షున నిర్వహించారు. బుధవారం నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా ఏపీ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి హాజరై పార్టీ కార్యకర్తలకు ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ త్వరలోనే అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని నూతన మండల కమిటీలను ఏర్పాటు చేస్తాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని మండలాల జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల గెలుపు కోసం పార్టీ శక్తి మొత్తం వినియోగించాలి అని పిలుపునిచ్చారు. ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ మరో పది రోజుల్లోనే అన్ని మండలాల కమిటీలు, క్లస్టర్, బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలి. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త చురుకుగా పనిచేయాలి అని సూచించారు. పార్టీకి కృషి చేసిన వారిని గుర్తించి పదవులు, బాధ్యతలు అందిస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక వైకుంఠం శివ ప్రసాద్, దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, బెంగళూరు కిషోర్, మండల కన్వీనర్లు సుధాకర్, విజయ భాస్కర్, అశోక్, కప్పట్రాళ్ల మల్లికార్జున, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్
- మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా చర్యలు
- అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలను నియంత్రించేందుకు పోలీసులతో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఉన్నత విద్యా, తదితర శాఖల అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణ అమలుపై సంబంధిత కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ రామునాయక్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి గంజాయి ఇతర మత్తు పదార్థాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైతే మత్తు పదార్థాలు లభ్యమవుతున్నాయో ఆయా ప్రదేశాలను గుర్తించి పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అన్ని విద్యాసంస్థలు కళాశాలల్లో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు నియంత్రణపై సంపూర్ణ అవగాహన కల్పించాలని కళాశాలల యాజమాన్య కమిటీలకు సూచించారు. అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ జిల్లా పోలీసు యంత్రాంగం తరపున మత్తు పదార్థాల నియంత్రణకు తమ వంతు బాధ్యతగా పనిచేస్తున్నామన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించి కళాశాలలో పాఠశాలలో ముఖ్యమైన కూడలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకొని తమకు తోచిన సాయం చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిస కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొంగిన వాగులు, నీటమునిగిన పంటలు

విశాలాంధ్ర - పాములపాడు : మొంథా తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. తహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. పంటలు నీట మునిగేది పలు గ్రామాల్లో ఇళ్లల్లోకి నీరు చేరాయి. దీంతో బుధవారం మండల అధికారులైన ఎంపీడీవో చంద్రశేఖర్ మండల పార్టీ అధికారి రాజు, ఎస్సై సురేష్ బాబు వారి సిబ్బందితో పలు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాములపాడు, చెలిమిళ్ళ రహదారి మధ్యలో ఎస్ఆర్ఎంసి సమీపాన భనాసి శుద్ధ వాగు కలిసి రహదారిపై పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచి పోయాయి. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జెయసూర్య ఎంపీడీవో చంద్రశేఖర్‌తో కలిసి రహదారిని, నీడ మునిగిన పంటలను పరిశీలించారు. జూటూరు సమీపంలోని ఊటాగు పొంగిపొర్లడంతో జగనన్న కాలనీ మొత్తం నీట మునిగింది, తుమ్మలూరు, కృష్ణరావు పేటలోని రహదారుల వెంట నీరు ప్రవహించడంతో ఎస్ఐ సురేష్ బాబు తన సిబ్బందితో కలసీ జెసిబి, పోక్లేన్లతో సహాయ చర్యలు చేపట్టారు. ఇస్కాల గ్రామంలో ఎస్సీ కాలనీలో నీరు చేయడంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడ్డారు,భవనాసి వుధృక్తంతో ప్రవహించడంతో ఎస్సార్ ఎంసిపై ఉన్న బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో ఇస్కాల కమ్మలపల్లె మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంతేగాకుండా అనేక గ్రామాల్లో కాలనీలోకి నీళ్లు చేరడం మొక్కజొన్న మినిమం తదితర పంటలు నీటిమలగడంతో రైతుల దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఎమ్మెల్యే గీత జయసూర్య మాట్లాడుతూ ప్రజలను రైతులను అన్ని రకాలుగా కూటం ప్రభుత్వం ఆదుకుంటుందని, ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. వీరి వెంట మండల వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రెవెన్యూ డివిజన్‌లో కలపాలి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : కోవెలకుంట్ల మండలాన్ని డోన్ రెవెన్యూ డివిజన్ నుంచి తప్పించి నంద్యాల డివిజన్‌లో చేర్చాలని స్థానిక నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూగత ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సరిదిద్దుకునే అవకాశం మళ్లీ కూటమి ప్రభుత్వంలో అవకాశం వచ్చింది అన్నారు. బ్రిటిష్ హయాం నుండి కోవెలకుంట్ల మండలం నంద్యాల రెవిన్యూ డివిజన్ లో కొనసాగుతూ వచ్చిందని కోవెలకుంట్ల మండల ప్రజలకు సౌకర్యవంతమైన బస్సు, రైలు మార్గాలు కలిగిఉండి మండల సరిహద్దు నుండి నంద్యాల జిల్లా రెవెన్యూ కేంద్రము కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉండి విద్య ఉద్యోగ, వైద్య తదితర అవసరాల కోసం కోవెలకుంట్ల మండలం నుండి వేలాదిమంది ప్రతిరోజు నంద్యాలకు ప్రయాణిస్తూ వారి రోజువారి కార్యక్రమాలను ముగించు కొని తిరిగి వస్తున్నారని, ఇట్టి పరిస్థితులలో కోవెలకుంట్ల మండలాన్ని ఎలాంటి బస్సు, రైలు సౌకర్యం లేకుండా దాదాపు 75 కిలోమీటర్ల దూరం ఉన్నటువంటి డోన్ రెవెన్యూ డివిజన్ లో కలపడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. నాటి వైసీపీ ప్రభుత్వం లోని పాలకులు వారి స్వార్థం కోసం కోయిలకుంట్ల మండలాన్ని డోన్ రెవెన్యూ డివిజన్ లో కలిపారు. అప్పటి నుండి ఈ సమస్యపై ఎన్నో విన్నపాలను ఆనాటి ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ప్రయో జనం లేకుండా పోయింది. ప్రజలందరూ పార్టీలకతీతంగా కలిసి రావాలని వారు పిలుపునిచ్చారు. పట్టణానికి చెందిన టిడిపి నాయకులు గడ్డం రామకృష్ణారెడ్డి, ఆమడాల మద్దిలేటి, నోస్సం రమణయ్య, వై.రంగారెడ్డి, ఎస్.రామ సుబ్బారెడ్డి, బిజినవేముల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: లింగ వివక్ష చట్ట రీత్యా నేరమణి, దేశవ్యాప్తంగా బేటీ బచావో - బేటీ పడావో లక్ష్య సాధన కోసం కృషి జరుగుతుందని ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. న్యూ ఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీనడ్డా అధ్యక్షతన 31వ కేంద్ర పర్యవేక్షణ మండలి సమావేశం జరిగిందని కేంద్ర పర్యవేక్షణ మండలి సభ్యురాలు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రి కన్సెప్షన్, ప్రి నటల్ డైగ్నోస్టిక్ టెక్నిక్యూస్, 1994 అమలు, ప్రగతిని సమీక్షించి, లింగ సమానత్వం, మహిళారక్షణ, గర్భనిర్ధారణకు ముందు, తర్వాత లింగ వివక్ష నిర్మూలన వంటి అంశాలపై చర్చించామన్నారు. దేశ వ్యాప్తంగా బేటీ బచావో - బేటీ పడావో లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా ఈ సమావేశం ముఖ్యమైన అడుగుగా నిలిచిందన్నారు.

కరెంటు స్తంభాలను తీగలను ముట్టుకోవద్దు

విశాలాంధ్ర - సి.బెళగల్: వర్షం కురుస్తున్నప్పుడు ఎవరు కరెంటు తీగలను, స్తంభాలను ముట్టుకోరాదని మండల విద్యుత్ ఏఈ సుకుమార్ అన్నారు. ముంథా తుఫాను ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్నందున మండల విద్యుత్ ఏఈ సుకుమార్ మండల ప్రజలకు సూచనలు తెలిపారు. వర్షం పడేటప్పుడు గ్రామాల్లో ఎవరైనా కరెంట్ స్తంభాలను, కరెంటు తీగలను, కరెంటు డిప్పులను ముట్టుకోరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా ఆగిపోతే మొబైల్ ఫోన్‌లకు, బ్యాటరీ లైట్లకు చార్జర్‌లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అనాథ పిల్లలచే జై భీమ్ ఎమ్మార్పీఎస్ పాట విడుదల

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని జై భీమ్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు శవాల బుజ్జి బాబు మాదిగ ఆధ్వర్యంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ సంఘం మూడవ సాంగ్ అనాథ పిల్లల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ మూడోపాట విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు హాజరు కావడం జరిగింది. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదెంటుకుసుమం ఆనంద్ రచించి పాడిన సాంగ్ చాలా అద్భుతంగా ఉందని ఇలాంటి కుసుమలను మనం ఎల్లవేళలా తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జై భీమ్ ఎమ్మార్పీఎస్ సంఘం మూడో పాట అనాథ పిల్లల చేతుల మీద విడుదల చేయడం చాలా అర్హనీయమని, రాబోయే రోజుల్లోనూ మూలనబడిన సప్పోగు ఆనంద్ పాటలను ఢిల్లీ ఎర్రకోట గడ్డకు వినిపించడానికి తమవంతుగా కృషి చేస్తామన్నారు.

పత్తికొండను కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర- పత్తికొండ: పత్తికొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బిజెపి అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్ నాయుడు, మండల అధ్యక్షులు కరణం నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం బిజెపి నాయకులు ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు రైతులు సాగుచేసిన పంటలన్నీ తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి అతివృష్టి కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు లక్ష రూపాయలు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా ఇన్సూరెన్స్ నిధులను రైతుల ఖాతాలలో జమ చేసి, రబీ సీజన్ పంటల సాగుకు ఉచిత విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పూన మల్లికార్జున, దండి మల్లికార్జున, ఓబీసీ నాయకులు రామాంజనేయులు, బ్రహ్మయ్య, శంకరయ్య, గోపాల్, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం వలన జిల్లాలోని వాగులు కాలువలు నదులు పొంగి పరవహిస్తున్న నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ జిల్లా పోలీసు అధికారులను సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ నంద్యాల పట్టణ కేంద్రం లోని హరిజనవాడ, వై జంక్షన్, ప్రథమనంది, విశ్వనగర్, సలీం నగర్, పద్మావతినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పోలీస్ అధికారులను వరద పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, ఎలాంటి ఆస్తి ప్రాణ నష్టం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వరద వలన కలగు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పారుమంచాల, తుడిచెర్లకు రాకపోకలు బంద్

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మొంత తుఫాన్ ప్రభావంతో బుధవారం పారుమంచాల, తుడిచెర్లకు ఆర్ అండ్ బీ రహదారిపై ఉన్న ఇసుక వాగు ఉధృతంగా ప్రవహించింది. వాగు ఉధృతంగా పెరగడంతో బుధవారం ఉదయం ఎంపీడీవో గోపికృష్ణ, ఎస్సై మల్లికార్జున వాగు ఉధృతి పరిస్థితిని పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగు ఉధృతి పెరిగే అవకాశం ఉండడంతో ఈ రహదారిపై రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేశారు. వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణం చేయవద్దని, ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు వాహనదారులు ప్రత్యామ్నంగా మార్గాలు ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఇసుక వాగు వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు, జలమయమైన కాలనీలు

విశాలాంధ్ర - వెలుగోడు: రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన తుఫాను ప్రభావం వెలుగోడు పట్టణాన్ని సోకింది. వెలుగోడు మండలంలో అత్యధిక వర్షపాతం 17.2సె. మీ నమోదైనట్లు తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ తెలిపారు. మండలంలోని వేల్పనూరు వద్ద గల నిప్పుల వాగు, వేల్పనూరు రహదారిలో గల మంచినీళ్ల వాగు, బోయరేవుల గ్రామం వద్ద గల గాలేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జిపై నుంచి, మాధవరం గ్రామం వద్ద గల నిప్పుల వాగుపై నిర్మించిన బ్రిడ్జి పైనుంచి నీరు పొంగి పొర్ల డంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బ్రిడ్జిల వద్ద తలారులను ఉంచి భద్రతా చర్యలను చేపట్టారు. ఆత్మకూరు ప్రధాన రహదారి నందు పెట్రోలు బంకు వద్ద రెండున్నర అడుగుల మేర నీరు ప్రవహిస్తుండడంతో గ్రామ పంచాయతీ ఈవో నరేంద్ర సహకారంతో జెసిబిని ఏర్పాటు చేసి కాలువలో పూడిక తీసి నీరు పోయేలా చర్యలు తీసుకున్నారు. తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న భారీ వేప చెట్టు వర్షనికి కూలింది. లోతట్టు ప్రాంతంలో ఉన్న కాలనీలన్నీ జలమయం కావడంతో, విజయ దుర్గ చెంచు కాలనీ లోని 150 మంది చెంచులను గిరిజన హాస్టల్ వద్ద గల ప్రత్యేక శిబిరానికి తరలించి, టిడిపి నాయకులు శేషిరెడ్డి, రసూల్ సహకారంతో వారికి భోజన ఏర్పాట్లను చేశారు. నంద్యాల జాయింట్ కలెక్టర్ కార్తీక్ స్పెషల్ ఆఫీసర్ మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ హీరా నాయక్‌లు వెలుగోడు పట్టణంలోని జలమయం ప్రాంతాలను సందర్శించి అధికారులకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. వెలుగోడు గ్రామపంచాయతీలోని ఆత్మకూరు మెయిన్ రోడ్డు నందు వాటర్ లాగింగ్ ప్రదేశాలను జాయింట్ కలెక్టర్ కార్తీక్ పరిశీలించి వాటర్ లాగింగ్ లేకుండా తొలగించాలని, మండలంలో ఎక్కడైనా రహదారులపై అధికంగా నీరు ప్రవహిస్తుంటే అక్కడ వీఏఏలు, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు రోడ్డు నందు జేసీబీతో వాటర్ డ్రైన్ లోకి పోయే విధంగా చేయడం జరిగింది. మండలంలో అధికంగా నీరు ప్రవహిస్తున్న వంతెనలు మరియు రహదారుల వద్ద తలారులు, సచివాలయ సిబ్బంది, పోలీసు వారితో పికెటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. కనుచూపు మేర పడిపోయిన వరి పంట రైతులకు తీవ్ర నష్టం జరిగిందని వ్యవసాయ అధికారిని స్వాతి వెల్లడించారు. మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వెలుగోడు మండలంలో 172 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వెలుగోడులో కనుచూపు మేర వరి పంట నేలవాలింది. ఎకరాకు దాదాపు రూ.30 నుండి 35 వేల వరకూ పెట్టుబడి పెట్టామని, చేతికొచ్చిన పంట నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని బుధవారం ఎస్టీయూ భవన్‌లో ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం సీనియర్ నాయకులు మానపాటి సూర్యుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎస్టీయు రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యుడు, రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప హాజరై మాట్లాడుతూ 2011 కంటే ముందు ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్సిటిఈ వారు చేసిన సిఫారసుల సమంజసం కాదని ఉపాధ్యాయ వృత్తిలో చేరి దాదాపుగా 25ఏళ్ళు గడిచి పోయిన ఉపాధ్యాయులకు టెట్ రాయాల్సిన ఆవశ్యకత ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య హక్కు చట్టం 2009కు సవరణ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని సూచించారు. అనంతరం ఎస్టీయు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ నియమించి వెంటనే 30 శాతం ఐఆర్ మధ్యంతర భృతిని ప్రకటిం చాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. మండల గౌరవ సలహాదారులు అబ్దుల్ నబీ, ఆర్థిక కార్యదర్శి షేక్షావలి, కౌతాళం మండల ఉపాధ్యక్షుడు ఆంజనయ్య, సీనియర్ నాయకులు ఎంఎస్ భాస్కర్, ఆర్పీ వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ రెడ్డి, దామోదరచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు కేపీ యల్లప్ప, వైసీపీ ఇంటలెక్షవల్ తాలూకా అధ్యక్షులు బ్రహ్మయ్య, వైసీపీ ప్రచార విభాగం తాలూకా అధ్యక్షులు ముక్కరన్న, వైసీపీ విద్యార్థి విభాగం తాలూకా అధ్యక్షులు దయ్యాల మహబూబ్, మత్స్య శాఖ సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద వీరేష్, వైసీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొగ్గుల అర్లప్ప హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని చిన్న తుంబలం, పెద్దకడబూరు, గంగులపాడు గ్రామాలలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండల సభ్యులు పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పీపీపీ విధానాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ తీసుకువచ్చి 7 కళాశాలలను పూర్తి చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందేమోనని భయంతో పీపీపీ పేరుతో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టిందని మండిపడ్డారు. పీపీపీ విధానం ద్వారా పేదలకు వైద్య విద్యను, ఉచిత వైద్యాన్ని దూరం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేసుందని ఆరోపించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నవీన్ రెడ్డి, బొగ్గుల ఇస్సాక్, ప్రసాద్, కొరవ సుందరం, చిన్నతుంబం సోమప్ప ధని, లింగన్న గౌడ్, తెలుగు చిన్న వీరేష్, బోయ కడబూరి చౌళ్ల లక్ష్మన్న, కందనాతి మహదేవ, వలిబాషా, నజీర్, చెన్నబసన్న గౌడ్, మల్లయ్య, ఇస్మాయిల్, ప్రభుదాస్, సునీల్, యోహాన్, ఉసేని, లింగన్న, గోసలి మహదేవ,తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి నగర్‌లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మొందా తుఫాన్ కారణంగా మంగళవారం కురిసిన భారీ వర్షంతో పట్టణంలోని గాయత్రి నగర్‌లో వరద నీరు ఇళ్లలోకి చేరుకుంది. ఇళ్లల్లోకి వచ్చిన నీటితో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులను బుధవారం మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి పరామర్శించారు. వర్షపు నీరు వచ్చిన ప్రదేశానికి వెళ్లి అక్కడ ప్రజలతో మాట్లాడి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ తో ఫోన్లో మాట్లాడి తుఫాన్ వల్ల నష్టపోయిన బాధిత కుటుంబాలను వెంటనే ఆదుకొని వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాను కారణంగా కురిసిన వర్షంతో పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుకుందన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు పట్టించుకోకపోతే వైకాపా తరఫున తామే సహాయక చర్యలు చేపడతామన్నారు. పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరడంతో అంటువ్యాధులు అవకాశం ఉందని, శానిటరీ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. భారీ వర్షం కారణంగా మొక్కజొన్న రైతులు చాలా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అర్జీలు ఇవ్వడం కాదని తక్షణ సహాయ చర్యలు కావాలని ఆయన డిమాండ్ చేశారు. రంగు మారిన ధాన్యం మొలకెత్తిన ధాన్యం కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిన విధంగా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. కౌన్సిలర్లు గొట్లూరు సుధాకర్రెడ్డి, రాధమ్మ, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, గంగుల రామిరెడ్డి, కోట కందుకూరు గోపాల్ రెడ్డి ఉన్నారు.

అత్యాశకు పోయి అవినీతికి పాల్పడరాదు : డీఆర్వో

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: పభుత్వ ఉద్యోగులు ఆత్మసాక్షితో విధులు నిర్వహించాలని, అత్యాశకు పోయి అవినీతికి పాల్పడరాదని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ ప్రభుత్వ ఉద్యోగులను కోరారు. బుధవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ -2025 జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ పాల్గొని సబికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 31 వ తారీఖున స్వర్గీయ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన సందర్భంగా రాష్ట్రంలో అవినీతి నివారణపై ప్రజలకు, ఉద్యోగస్తులకు అవగాహన కార్యక్రమం అక్టోబర్ 29 నుండి నవంబర్ 2 వరకు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎంతో కష్టపడి చదివి లక్షల మందితో పోటీపడి పరీక్షలు రాసి సాధించిన ఉద్యోగాన్ని ప్రజల అభివృద్ధి కోసం చేయాలని, మనకున్న ఈ ఉన్నతమైన స్థానాన్ని నిలబెట్టుకోవాలని ఆ విధంగా ప్రజలకు సేవ చేసే అవకాశం మనకు మాత్రమే ఉన్నదని తెలిపారు. ప్రజలు కట్టే పన్నుల నుండి మనకు ప్రతినెల జీతాలు వస్తున్నవని అది గుర్తు పెట్టుకుని ప్రజలకు సేవ చేయాలని అంతేకానీ ప్రజలకు చేయవలసిన పనుల కొరకు అవినీతికి పాల్పడి వారి నుండి పైకం ఆశించరాదని డిఆర్ఓ తెలియజేశారు. ప్రస్తుతం అధికారులు సరిగా పని చేయని చో రాష్ట్ర ప్రభుత్వం ఐవి ఆర్ ఎస్ ద్వారా విషయాలు ప్రజల నుంచి సేకరించుకొని తగిన చర్యలు తీసుకుంటూ ఉందని, ఉద్యోగులు సీసీఏ రూల్స్‌కు అనుగుణంగా ప్రజలకు, ప్రభుత్వానికి సేవలు అందించాలని తెలిపారు. ఈమధ్య ఉద్యోగస్తులకు కొందరి ఫేక్ ఫోన్ కాల్స్, డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్ కాల్స్ వస్తూ ఉన్నవని వాటికి భయపడకుండా తమ ఉద్యోగ ధర్మాన్ని పాటించాలని, నిజాయితీతో పని చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగి తన వద్ద నిబంధనల మేరకు వేయి రూపాయల కంటే ఎక్కువ నగదు ఉంచుకోరాదని తెలియజేశారు. ఆరోగ్యంగా ఉండటమే మంచి సంపదని అది గుర్తుంచుకొని ఉన్నదానితోనే సంతోషంతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని కోరారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి అవినీతి నిరోధక శాఖ డిఎస్పి సోమన్న మాట్లాడుతూ అవినీతి నిరోధక అవగాహన కార్యక్రమం ఒక వారం రోజులు పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలు 2000 సంవత్సరం నుండి జరుగుతూ ఉన్నవని తెలిపారు. లంచం ఇవ్వడం తీసుకోవడం రెండు నేరమేనని ,ఆ విధంగా చేసిన వారిపై కేసులు ఉంటాయని, కేసు రుజువైతే తీసుకున్న వారు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా చిన్నపిల్లల ఆరోగ్య శాఖ అధికారి జఫరుల్లా మాట్లాడుతూ అవినీతికి ఉద్యోగస్తులు దూరంగా ఉండాలని ఇచ్చిన సందేశం అందరిని ఆకర్షించింది, మంచి అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివరాముడు మరియు కొంతమంది ఉద్యోగులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా అవినీతి నిరోధక శాఖ ఇన్స్పెక్టర్లు కృష్ణ, రాజా ప్రభాకర్ ఉద్యోగస్తులు పాటించవలసిన నియమాలు, సూచనలు, కేసుల వివరాలు తెలుపుతూ అవినీతికి దూరంగా ఉండాలని తెలియజేశారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు, ఉద్యోగస్తులు హాజరయ్యారు.